# స్కీమ్ అండ్ స్కీమింగ్

"మన కంపెనీలో రీ ఆర్గనైజేషన్ స్కీము ఒకటి ప్రారంభించబోతున్నాం. సీనియర్ కదా మిమ్మల్ని సంప్రదించాకనే ఏ విషయం ఫైనలైజ్ చేద్దామని..."

ప్రమోద్ చెప్పుకుపోతున్నా రఘువీర్ వినటం లేదు. వినక్కరలేదు కూడా. ఈ మాటలన్నీ చాలా పరిచితమైనవిగా, ఎప్పటినుండో వింటున్నవిగా అనిపిస్తున్నాయి. ఇవి వినడానికి అతను ఎప్పుణ్నుంచో తయారుగా ఉన్నాడు. ఎప్పుడు వినబడతాయా అని టెన్స్‌గా ఉన్నాడు కూడా. "జనరల్ మేనేజర్ ప్రమోద్ సార్ పిలుస్తున్నారు" అని ప్యూన్ చెప్పినప్పుడే అనుకున్నాడు ఈ విషయం గురించే మాట్లాడతాడని. బొంబాయిలో కొత్త ఆఫీసు తెరవబోతున్నారని, కొంతమంది స్టాఫ్‌ని అక్కడకు తరలిస్తారనీ ఆఫీసులో గుసగుసలు వినబడినప్పుడే తెలుసు - ఇలాటి రోజు వస్తుందని.

రఘువీర్ శ్రద్ధగా వింటున్నాడో, లేదో గమనించినట్టు లేదు ప్రమోద్, చెప్పుకుపోతున్నాడు - "ఈనాటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే కొన్ని స్టెప్స్ తీసుకోక తప్పదు. మీ సర్వీసంత లేదు నా వయస్సు. మా ఫాదర్ టైములో జాయినయ్యారు మీరు. మీలాటి వారి కృషి వల్లనే కంపెనీ ఇంత పెద్దదయింది. నిజం చెప్పాలంటే నా కంటె మీకే ఈ కంపెనీతో అనుబంధం ఎక్కువ. ఒకలా ఇది మీ కంపెనీయే! మీ బిడ్డ లాటిది. దీని బాగోగుల గురించి ఎటువంటి ఇబ్బందికైనా సిద్ధపడే తండ్రిలాటి వారు మీరు..."

అచ్చు సీతాపతి చెప్పినట్టే జరుగుతోంది. అతనికి వాళ్ల బాస్ ఇవే మాటలు చెప్పాడు. లోకంలో అందరు యాజమానులు ఇలాటి సందర్భాల్లో ఇవే డైలాగులు చెబుతారేమో! వీళ్లందరి స్క్రిప్టు రాసిచ్చేవాళ్లు ఒకరేనేమో! సీతాపతికి పట్టిన గతే తనకూ పడుతున్నందన్నమాట!

ఆవేళ సాయంత్రం పెద్దబజారు నుండి ఆటో ఎక్కాల్సి వచ్చింది. చేతినిండా సామాన్లు. స్కూటర్ స్టార్టు కాలేదు. తెలిసున్న మెకానిక్‌కు అప్పగించి, ఆటో పిలిచాడు. అశోక్‌నగర్ అనగానే 'మీటరు మీద ఐదు రూపాయలు ఇవ్వండి' అన్నాడు ఆటోవాడు. "ఏమిటయ్యా, ఈ టైములో కూడా ఎక్స్‌ట్రా అడుగుతావ్. కంప్లెయింట్ ఇస్తానుండు" అంటూ ఆటో దిగి ఒక చేత్తో మీటరు పట్టుకుని పోలీసు కోసం చూశాడు. ఎవడూ కనబడలేదు.

"ఏం పిలవమంటావా? మర్యాదగా మీటరు మీద వస్తావా?" అన్నాడు ఆటోవాడి కేసి చూస్తూ. వీధిదీపం వెలుగు కొద్దిగా పడడంతో ఆటోవాడి మొహం మీద చిరునవ్వు కనబడి ఇంకా చిర్రెత్తించింది.

"ఎన్నేళ్లు గడిచినా దంబం మాత్రం పోలేదురా, రఘూ! చుట్టూ కనుచూపుమేరలో పోలీసు లేడు. ఎవణ్ని చూపించి దబాయిద్దామనుకుంటున్నావ్ బాబూ" అన్నాడు ఆటోవాడు కిందకు దిగుతూ.

రఘువీర్‌కి మతిపోయింది ఆటోవాడి చనువుకి. అతని మొహంలోకి చూస్తూండగా క్రమంగా తెలిసివచ్చింది. అతను వేరెవరో కాదు తన క్లాస్‌మేట్ సీతాపతి అని. చటుక్కున గుర్తు పట్టలేనందుకు సిగ్గుపడ్డాడు కూడా. అయినా తన తప్పేముంది? కాలేజీ వదిలేసి పాతికేళ్ల పైమాట. పైగా సీతాపతిని ఇలా ఆటోవాడిలా చూడవలసి వస్తుందని ఎవడనుకోగలడు? అందునా అంతటి బ్రిలియెంట్ ఫెలో! ఓ పెద్ద కంపెనీలో తనకంటె పెద్ద ఉద్యోగం చేస్తున్నవాడు!

"ఆ జీఎమ్ ఉద్యోగం పాస్ట్‌టెన్స్‌రా నాన్నా! ఈ ఆటోడ్రైవరుద్యోగం ప్రజెంట్ టెన్స్! ఫ్యూచర్ టెన్సేమో కూడా!" అన్నాడు సీతాపతి కాస్సేపటికి ఇద్దరూ కలిసి కాఫీ తాగుతూండగా.

"ఏం ఏమైనా గోల్‌మాల్ చేసావా?" అన్నాడు రఘువీర్ అనుమానంగా చూస్తూ.

"నీకు ఉద్యోగం ఇచ్చిన చెవలాయ్ ఎవడ్రా? గోల్‌మాల్ చేసి ఉంటే ఆటో ఎందుకు నడుపుకుంటాన్రా? ఆ మాత్రం ఆలోచించలేవూ?" అని విసుక్కున్నాడు సీతాపతి.

"మరి నీకీ ఖర్మ ఎందుకు పట్టింది? బ్రహ్మాండమైన ఉద్యోగం ఏమయింది?" అని అడిగేను తను తెల్లబోతూ.

అప్పుడు చెప్పుకొచ్చాడు సీతాపతి – వాళ్ల కంపెనీ రీఆర్గనైజేషన్ స్కీము ఎలా చేపట్టిందీ, తనను ఎలా సలహాలు అడిగిందీ, తనకి అసిస్టెంటుగా ఓ కుర్రాడిని ఎలా వేసిందీ, చివరికి తన ఉద్యోగం పీకి ఇంటికి ఎలా పంపినదీ, "వీళ్లకి మనం అక్కర్లేదురా, మనలో రసం అంతా పిండేశారుగా, కుర్రాళ్లను పట్టుకుని, మనచేతే ట్రెయినింగ్ ఇప్పించి మనకన్ను మన వేలిచేతనే పొడిపిస్తారు. కంపెనీ నుండి తరిమేస్తారు. ఈ కంపెనీ భూతానికి ఎప్పుడూ యువరక్తమే కావాలి. కంప్యూటర్ మీద గంటల తరబడి కిమ్మనకుండా పనిచేసేవాళ్లు కావాలి. మనబోటి వాళ్లను అడిగితే కంప్యూటరా? బాబోయ్ అంటాం. అందువల్ల మనను వదుల్చుకుంటారు" అన్నాడు.

"నాకూ కంప్యూటర్ రాదే!" అంటూ కంగారుపడ్డాడు తను.

"అయితే నీకూ ఉద్వాసన తప్పదు. కానీ దేవాంతకులురోయ్! నిన్ను ఔట్‌రైట్‌గా డిస్మిస్ చేయరు. కంపెనీ పునర్వ్యవస్థీకరణ అంటారు. కొత్త వింగ్ అంటారు, నువ్వే బాస్ అంటారు, అన్నీ సెటప్ అయ్యేక నిన్ను విసిగిస్తారు, అవమానిస్తారు, కుర్రాళ్లతో పోల్చి నువ్వు యూస్‌లెస్ ఫెలోవని నీచేతే అనిపిస్తారు. చివరికి నీ అంతట నువ్వే రిజైన్ చేసేట్టు చేస్తారు. దాంతో నీకు కాంపెన్సేషన్ ఇచ్చే ఖర్చు కూడా తప్పుతుంది."

"పోరా, నీ చిలకజోస్యం నువ్వూ. నీ విషయంలో అలా అయింది కాబట్టి అందరికీ అలా జరగాలని లేదు. మా కంపెనీలో ప్రదీప్ అని ఒక యంగ్ అండ్ డైనమిక్ ఫెలో వచ్చాడు కొత్తగా. నేనంటే చచ్చే గౌరవం. అన్నీ నన్నడిగే చేస్తాడు. అంకుల్ అంటాడు తెలుసా, అప్పుడప్పుడు" గర్వంగా చెప్పాడు తను.

"అంకుల్ అన్నాడూ, చచ్చేవే! వెర్రిపీనుగా, నువ్వు ముసలాడివయిపోతున్నావురా, నాకు కావలసినది బ్రదర్స్, అంకుల్స్ కాదు అని చెప్తున్నాడు. గ్రహించుకో. ఇది నా ఒక్కడి అనుభవమే కాదు. సుబ్బారావు అని మన క్లాసుమేట్ ఉండేవాడు గుర్తుందా, కళ్లజోడు, ఇందిర వెంట పడుతూండేవాడు... వాడు. వాడికీ ఇలాగే అయింది. వాడు చెప్తే నేను కొట్టిపారేశాను. అచ్చు నీలాగే."

తనకి చెమట పట్టింది. తుడుచుకుంటూ, "ఇంతకీ నీకీ గతి ఎలా పట్టిందో చెప్పలేదు" అని అడిగేడు.

"ఎలా ఏముంది. ఉద్యోగం పోయాక వెతికి చూసాను. పెద్దహోదా అలవాటు చేసేశారు వెధవలు. ఆ దర్జాకి తగ్గలేం. దానికి తగ్గట్టు ఉద్యోగాలు దొరకవు. రెండేళ్లు ఖాళీగా కూచునేటప్పటికి డిమాండు కూడా పోయింది. డబ్బు కరిగిపోతూ ఉండడంతో ముందున్న ధైర్యం సన్నగిల్లింది. జీ ఎమ్‌గా చేసినవాణ్ని టైపిస్టుగా పనిచేయలేను కదా. అందుకే ఈ ఉద్యోగం..."

"ఏదీ ఆటోడ్రైవరుద్యోగమా? నవ్విపోతారు"

"నీ మొహం. దీనిలో సుఖం ఏమిటంటే ఎవడూ మనను గుర్తుపట్టడు. పోలిక తెలిసినా పొరబడ్డాననుకుంటాడు గానీ వచ్చి పలకరించడు. రాత్రుళ్లే నడుపుతాను. రోజుకి రెండు, మూడు వందలు మిగులుతాయి. అంతేకాదు, ఖాళీగా కూచుని బుర్ర పాడుచేసుకోవడం కంటె ఏదో ఈ రంధిలో పడితే ఆ బాధ మరచిపోతాను. ఒరేయ్! నువ్వు మాత్రం ఎవరి దగ్గరా నోరుజారకు. అనవసరమైన అప్రదిష్ట. నువ్వు క్లోజ్ ఫ్రెండ్‌వి కాబట్టి మంచివాడివి కాబట్టి పలకరించాను. లేకపోతే..."

"నీ బాధ అర్థమయిందిలే. ఎవ్వడితోనూ అనను."

ఇంకో అరగంట కూచుని ఇద్దరూ విడిపోయారు. వెళ్లిపోయేటప్పుడు తను ఆటోఛార్జి ఇస్తే సీతాపతి

నిరభ్యంతరంగా పుచ్చుకోవడంతో అర్థమయ్యింది - సీతాపతి పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో! ఎక్స్ట్రా ఐదు రూపాయలు మాత్రం వదిలేశాడు. అంతవరకూ నయం అన్నమాట!

ఇంటికి వచ్చినా సీతాపతి ఆలోచనలు వదలలేదు. ఆరోజే కాదు, ఈ రోజు దాకా తన మెదడంతా ఆక్రమించేశాడు సీతాపతి! అడుగడుగునా తనకు, అతనికి పోలికలు కనబడుతూండడంతో మరచిపోవడం అసాధ్యమయిపోయింది. నిజానికి ఆ రాత్రే ఇంట్లో తనూ, భార్యా కూచుని లెక్కలు వేసేశారు - ఒకవేళ ఉద్యోగం పోతే ఇల్లు గడుస్తుందా లేదా అని లెక్కవేయడం అంత సులభంగా సాగలేదు." ఇప్పుడు అర్థాంతరంగా ఉద్యోగం పోతే ఎలాగండి?" అంటూ ఏడుపు మొదలెట్టింది భార్య.

"నీ దుంపతెగా, ఉద్యోగం పోలేదే బాబూ! ఒకవేళ పోతే... అని ఆలోచించి చూడమంటున్నాను" అని మొత్తుకున్నాడు. కానీ ఆమె వినలేదు. అసలు నలభై ఐదేళ్లకే ఉద్యోగం ఊడిపోతే బతకడం ఎలా అని దిగాలు పడిపోయింది. అసలా ఊహ వచ్చిందంటే వెనక ఏదో కారణం ఉండే ఉంటుంది అని బెంబేలెత్తిపోయింది. ఇలాటి అర్థాంతరం ఉద్యోగస్తుడికి తనను కట్టబెట్టినందుకు తండ్రిని తిట్టిపోసుకుంది.

ఏతావాతా లెక్కలేసి చూడగా తేలిందేమిటంటే ఉన్నపళాన ఉద్యోగం పోతే, సంపాదించిన ఆస్తులు, అప్పులూ పోగా ఆర్నెల్ల వరకు మాత్రమే గ్రాసం ఉంటుంది. అదీ పిల్లల చదువులు మానిపిస్తే! తనకు వేరే ఉద్యోగం వస్తుందిలే అని ధైర్యం చెప్పుకుందామనుకున్నా చుట్టూ పరిస్థితులు ఏమాత్రం ఆశాజనకంగా లేదు. ఫైనాన్షియల్ మార్కెట్ చాలా డల్‌గా ఉంది. డబ్బు పుట్టడం కష్టంగా ఉంది. అనేక కంపెనీలు రెండు, మూడు నెలలు ఆలస్యంగా జీతాలిస్తున్నాయి. తన ప్రస్తుత కంపెనీ అనేక రెట్లు నయం.

రోజులు గడుస్తున్నకొద్దీ కంపెనీ తనను ఎందుకు తీసేయాలా అని ఆలోచించడమే ఎక్కువైపోయింది. తను ఎంత సేవ చేశాడీ కంపెనీకి! కంపెనీ చిన్నదిగా ఉండే రోజుల్లో, రాత్రింబవళ్లు పనిచేశారు. పదేళ్ల క్రితం క్రైసిస్ వస్తే తమంతట తామే జీతాలు తగ్గించుకున్నారు. ప్రమోద్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో మార్పులు చేసినా, అన్నిటికీ తల ఒగ్గారు. ఇవ్వలసినంత మర్యాద ఇవ్వకపోయినా, 'పోన్లే యువరక్తం' అనుకుని ఊరుకున్నాడు. అందరికంటె తనకు ఎక్కువ మర్యాద ఇవ్వడంతో, తన మాటకు ఎక్కువ విలువ ఇవ్వడంతో ఉద్యోగం పోయే స్థితి తనకు రాదని నమ్మకం ఏర్పడింది ఈ మధ్యే. అలాటిది ఇవాళ...

"రఘువీర్‌గారూ, మీరు ఏమీ వింటున్నట్టు లేదు" అని హెచ్చరించాడు ప్రమోద్.

"వినడానికి ఏముంది? మీరేం చెబితే దానికి తల ఒగ్గడమేగా మా పని" అన్నాడు రఘువీర్ కసిగా.

అతనికేసి ఎగాదిగా చూసాడు ప్రమోద్. "మీతో ముఖ్యమైన విషయాలు డిస్కస్ చేద్దామని ప్లాను చేసుకున్నాను. మీరేదో ఫౌల్ మూడ్‌లో ఉన్నట్టున్నారు. రేపు కలుద్దాం లెండి" అని అబ్రప్ట్‌గా కట్ చేసాడు.

'ఆ ముఖ్యమైన విషయం ఏమిటో నాకు ముందుగానే తెలుసురా, స్కీమింగ్ రాస్కెల్' అనుకున్నాడు రఘువీర్ ఆ రాత్రి మందు కొడుతూ. 'నా దగ్గర పాఠాలు నేర్చుకుని, నాకే ఎగనామం పెడతావురా. ఒకప్పుడు యూనియన్ లీడర్ చంద్రరావు పక్కలో బల్లెంలా తయారయితే ఎలా వదుల్చుకోవాలో ఆ టెక్నికంతా నేర్పినవాణ్ని నేను. అలాటిది అది నా మీదే ప్రయోగిస్తావా?' అని పళ్లు నూరాడు.

ఉద్యోగం పోతే ఏమవుతుందో అతని కళ్లముందు సినిమా రీల్లా తిరిగింది. కడుతున్న ఇల్లు ఆగిపోతుంది, అమ్మాయికి చూస్తున్న అమెరికా సంబంధం బెడిసికొడుతుంది. అబ్బాయి చదువు మధ్యలోనే మంగళం పాడేస్తుంది. భార్య ఖర్చులు తగ్గించుకోదు, తను తన అలవాట్లు మానుకోలేదు. చివరికి ముష్టి ఎత్తుకుని బతుకుదామనుకున్నా ఆ విద్యా రాదు. సీతాపతికి నిబ్బరం ఉంది వేరే చెత్తాకారీ పనిచేయడానికి. తనకు లేదు. అసలెందుకు ఉండాలి? నాకెందుకీ గతి పట్టాలి? అంతా ప్రమోద్ వల్ల కాదూ?

వాడే లేకపోతే ఈ సంస్కరణలు, పునర్వ్యవస్థీకరణలు ఉండేవా? హాయిగా ఏదో ఒక పద్ధతిలో

అలవాటైన రీతిలో కష్టపడుతూ ఉద్యోగం చేసుకునేవాళ్లం. రాత్రి ఎనిమిది గంటల దాక పనిచేసినా ఒక నిశ్చింత ఉండేది. వాడు, ఈ ప్రమోద్ గాడు వచ్చిన తర్వాతనే కొత్త మెషినరీ తెప్పించాడు. కొత్త బ్రాంచీలు తెరిచాడు. టై అప్ లన్నాడు. బిజినెస్ పెంచానన్నాడు. స్టాఫ్‌కీ జీతాలు పెంచానన్నాడు. అందరం చంకలు గుద్దుకున్నాం. పెరిగిన జీతాలకు మించి ఖర్చులు పెంచుకున్నాం. లైఫ్ స్టైలే మార్చేశాం.

ఇప్పుడేమయింది? వాళ్లెవరో టేకోవరు చేస్తున్నారంటాడు. ఇంత స్టాఫ్ ఉంటే వాళ్ల దేశపు పద్ధతి కాదంటాడు. ఇన్నేళ్లుగా నిన్ను విశ్వాసంగా కొలిచేన్రా అంటే దానికి జీతం ఇవ్వలేదా అంటాడు, నేనేమైనా బాండెడ్ ఓనర్‌నా? ఎల్లకాలం నిన్ను ఉద్యోగంలో ఉంచుతాను అని మాటిచ్చానా? అని వాదిస్తాడు. సెంటిమెంటు లేని ఫెలో. అవసరం లేని వాళ్లని క్రమంగా వదిలించుకుంటూ ఉంటే పోన్లే, వాపు తగ్గితే బలమే కదా అనుకున్నాను. రాస్కెల్, ఈ రోజు నాకే ఎసరు పెట్టాడు. రేపు....? అసలు రేపటిదాకా వీడిని ఉంచడం ఎందుకు?

రఘువీర్ ప్రమోద్ ఇల్లు చేరేసరికి రాత్రి పదిన్నర దాటింది. అతని ఫ్యాంటు జేబులో ఎత్తుగా ఉన్నది రివాల్వర్. అతనింట్లో తరచుగా బస చేసే వాళ్ల జిల్లా ఫ్యాక్షనిస్టు ఆస్తి అది. ఈ రోజు అవసరానికి పనికి వచ్చింది. ఎంత తాగినా, ఎంత ఆవేశంలో ఉన్నా తలుపు తీసిన ప్రమోద్‌కి గుడ్ ఈవెనింగ్ చెప్పడం మర్చిపోలేదు రఘువీర్.

ప్రమోద్ కూడా ఒక్కడూ ఉన్నాడు బంగళాలో. పెళ్లి కాలేదు సరే పనివాళ్లయినా ఉండాల్సింది. వాళ్లూ లేరు. తనే స్వయంగా జ్యూస్ కలిపి ఇచ్చాడు రఘువీర్ తిట్లు వింటూనే. అతను తుపాకీ తీసిన తర్వాత మాత్రం కాస్త చలించాడు.

"నేను చెప్పినది విని తర్వాత కాల్చండి, రఘువీర్!"

"ఇంకా వినేదేముంది?"

"ఉంది. మిమ్మల్ని ఈరోజు పిలిపించినది ఉద్యోగంలో నుండి తీసేసే ప్లానులో కాదు. బొంబాయి ఆఫీసుకు మిమ్మల్ని వేద్దామనుకున్నది నా స్వార్థంతో. అవును. ఈ కంపెనీని రీ ఆర్గనైజ్ చేసి మా బ్రదర్స్ మధ్య పంచుతామన్నారు ఫాదర్. బొంబాయిలో పెట్టబోయే కొత్త కంపెనీ నా వాటాకు వస్తుంది. దానిలో మీ లాటి అనుభవజ్ఞులైన వారుండాలని నా ప్లాను. అందుకే ట్రాన్స్‌ఫర్ పేరుతో అక్కడకు తీసుకుపోయి అక్కణ్నుంచి మిమ్మల్ని లాగేసుకుందామని అనుకున్నాను. మీరిక్కడే ఉంటే అన్నయ్య ఎగరేసుకుపోతాడు..."

"మీ అన్నయ్యగారు మొన్న కలకత్తా నుండి ఫోన్ చేసి ఈ ఆదివారం ఊళ్లోనే ఉండమని అన్నారు" అన్నాడు రఘువీర్ గుర్తుకు తెచ్చుకుంటూ.

"అన్నాడూ... ఐ సస్పెక్టెడ్ ఇట్. అందుకే నేను ముందుగానే మేలుకున్నాను. ఆదివారం లోగానే మిమ్మల్ని బొంబాయి పంపించి వేస్తే వాడేం చేయగలడు? మీరు అక్కడికి వెళ్లిన తర్వాత నా కొత్త కంపెనీకి లాక్కొచ్చి మిమ్మల్ని ఎమ్.డీ.గా పెట్టేసి నేను ఇంకో కంపెనీ ఫ్లోట్ చేద్దామనుకున్నాను. మీ ఐడియా కనుక్కుందామని పొద్దున్న మాట్లాడబోయాను..."

"ఇదంతా గ్యాస్!" అరిచాడు రఘువీర్. అరుస్తూ ముందు కురికాడు కానీ ప్రదీప్ కాలు అడ్డుపెట్టడంతో బోర్లా పడ్డాడు. అతని చేతిలోని రివాల్వర్ ఎగిరి సోఫా కింద పడింది. ప్రదీప్ చటుక్కున అతని అరచేతి మీద కాలు వేసి నిలబడ్డాడు.

"చూడు రఘువీర్, మీరు నమ్మకపోతే పొద్దున్నే వెళ్లి నా పర్సనల్ ఫైల్‌లో చూడండి. మీ గురించి ఏం రాసుకున్నానో తెలుస్తుంది." అన్నాడు.

మత్తంతా దిగిపోయినట్టనిపించింది రఘువీర్‌కి. తలెత్తి చూస్తూ, "నిజమేనంటారా, సార్!" అన్నాడు దీనంగా. అతని గొంతులో మార్పును గమనించిన ప్రదీప్ పక్కకు తప్పుకుని అతన్ని లేవదీసి కుర్చీలో



కూచోబెట్టాడు. అంతకుముందు చెప్పినదే ఇంకా వివరంగా చెప్పేడు. రఘువీర్‌కి అర్థమయింది తనెంత తొందరపడినదీ "సారీ సర్" అన్నాడు సిగ్గుపడుతూ.

ప్రదీప్ చిరునవ్వు నవ్వాడు. నవ్వుతూనే జేబులోంచి ఒక ఉత్తరం తీసి సిగరెట్ లైటర్‌తో కాల్చివేసాడు.

రఘువీర్ దానికి వింతగా చూస్తూ ఉంటే, "ఆత్మహత్య ఉత్తరం, నాదే" అన్నాడు చూపులకు జవాబు చెపుతున్నట్లు.

రఘువీర్‌కి నిలువుగుడ్లు పడిపోయాయి. "మీరెందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకోడం?" అన్నాడు మాటలు పేర్చుకుంటూ.

"పరిస్థితులు అలా తోసుకువచ్చాయి కనుక. కంపెనీలోంచి డబ్బు విడిగా లాగేసి నేను చేసిన వెంచర్లు కలిసిరాలేదు కనుక!"

"అంటే, అంటే... మీరు కంపెనీ ఫండ్స్ సైఫన్ ఆఫ్ చేసేస్తున్నారనే రూమర్లు నిజమేనన్నమాట!" అడిగాడు రఘువీర్ తెల్లబోతూ.

"అక్షరాలా నిజం. ఇన్నాళ్లూ కంపెనీ జాయింట్ ప్రాపర్టీగా ఉందిగా. నా అజమాయిషీలో ఉన్నవాటిల్లోంచి డబ్బు తీసేసి, పారిస్‌లో పెట్టుబడులు పెట్టాను. సాయంత్రం న్యూస్‌లో వినేవుంటారు. అట్లాంటిక్‌లో ఒక షిప్ మునిగిపోయిందని. అది నాదే! ఇన్నేళ్లుగా కాజేసినదంతా ఒక్క దెబ్బతో పోయింది. ఇన్సూరెన్స్ కూడా పెద్దగా రాదని చెప్పేశారు లాయర్లు."

"యూ మస్ట్ బీ జోకింగ్! ఐదు నిమిషాల క్రితమే మీరు కొత్త కంపెనీ..." అనబోయేడు రఘువీర్.

"మైడియర్ సర్, అది మధ్యాహ్నం నేననుకున్నది. కానీ సాయంత్రానికి పరిస్థితి మారిపోయింది. నేనప్పుడు మిమ్మల్ని పిలిపించినప్పుడు నా ఐడియా ఏమిటో వివరించి చెప్పానంతే!"

"అయినా డబ్బు పోయిందని ఆత్మహత్య చేసుకోవడం.."

"పూర్తిగా విను మిస్టర్! డబ్బు పోయిందన్న బాధ ఒక్కటే కాదు, నేను చేసిన చోరీ మా వాళ్లకు

తెలిసిపోయిందనే బాధ కూడా తోడయింది. ఓడ మునిగిపోగానే నా పార్టనర్లు కంగారుపడి మా అన్నయ్యకు చెప్పేశారు. వాడు వెంటనే అందరికీ చాటేశాడు. ఇందాకటినుండీ ఫోన్ మీద ఫోన్. మా బ్రదర్స్ నన్ను ఎక్స్‌పోజ్ చేసేసి, కోర్టుకి లాగుతారనే భయం పట్టుకుంది. ఈ బాధ పడలేక ఫారిన్ పారిపోదామన్నా, అక్కడా ఏమీ మిగలకుండా పోయింది. వ్రతమూ చెడింది, ఫలమూ దక్కలేదు."

"సారీ ఫర్‌యూ సర్! కానీ ఏం చేస్తాం, మన చేతుల్లో ఏముంది కనక!" అని జాలిపడ్డాడు రఘువీర్.

"కరెక్ట్. నేనూ అలాగే అనుకుని దిగాలుగా కూచున్నాను. చిన్నప్పణ్నుంచి సాహసానికి మారుపేరుగా పేరుబడ్డాను. ఇక సాహసి అనరు. దుస్సాహసి అంటారు. డబ్బు విషయంలో కూడా కుటుంబ సభ్యులమే కాబట్టి ఏదోలా రాజీ పడవచ్చు. కానీ నేను చేసిన ఎడ్వెంచర్ మిసెడ్వెంచర్ అయిందని అందరూ వెక్కిరించడమే నేను భరించలేని విషయం. అందుకే ఆత్మహత్యా ప్రయత్నం. అందుకే పనివాళ్లనందరినీ పంపించేసి ఉత్తరం రాసాను." అంటూ ఆగేడు ప్రదీప్.

"పోన్లెండి. జరిగినదేదో జరిగింది. ఉత్తరం కాల్చేసారుగా. ఇక మర్చిపోండి."

"ఉత్తరం కాల్చేసింది అందుకు కాదు" అంటూ ప్రదీప్ వంగి సోఫా క్రింద నుండి రివాల్వర్‌ను జాగ్రత్తగా రుమాలుతో బయటకు లాగేడు. తన వేలిముద్రలు పడకుండా జాగ్రత్తపడుతూ కణతలకు గురిపెట్టుకున్నాడు. "థాంక్యూ రఘువీర్, సమయానికి వచ్చి నా సమస్య తీర్చావ్." అన్నాడు.

"ఏ... ఏమిటి చేస్తున్నారు, సార్?" అన్నాడు రఘువీర్ ముందుకు రాబోతూ.

"ఆత్మహత్య చేసుకోవడానికి కూడా నాకు అభిమానం అడ్డువచ్చే ఇంత సేపూ కాల్చుకోకుండా కూచున్నాను. సాహసిగా పేరుబడ్డ ప్రమోద్ ఈనాడు పిరికివాడిలా ఆత్మహత్య చేసుకున్నాడని లోకం అనుకోకూడదని నా తాపత్రయం.."

"... కానీ మీరు ఆత్మహత్య చేసుకోవటం లేదుగా!"

"నేను చేసుకున్నదానికి నువ్వేం పేరుపెట్టినా పోలీసులు, జనం కూడా హత్య అనే పేరుపెడతారు. 'ఉద్యోగం పోతుందన్న భయంతో ఒక ఉన్నతోద్యోగి యజమానిని చంపిన వైనం' అని హెడ్డింగ్ పెట్టి పేపర్లలో వేస్తారు. తుపాకిపై నీ వేలిముద్రలు, ఇంత రాత్రివేళ నీవొక్కడవే కార్లో ఇక్కడకు రావడం – కోర్టుకి ఇంకేం కావాలి? మా ఫ్యామిలీ మెంబర్స్‌కి నా మీద జాలి కలుగుతుంది. ఎలాగూ పోయాడు. వాడి పేరు రచ్చకీడ్చడం దేనికని ఓడ సంగతి ఎక్కడా చెప్పరు. పైగా నా పేరు మీద ఒక బిల్డింగో, హాస్పిటలో కడతారు."

రఘువీర్‌కి ఇదంతా అర్థమయి ప్రదీప్ మీద పడేటప్పటికి కొంత ఆలస్యమయింది. అప్పటికే ప్రమోద్ తయారుగా ఉన్నాడు. రఘువీర్ తన మీద పడుతూండగానే ట్రిగ్గర్ నొక్కేసుకున్నాడు.